
ప్రజాశక్తి
సోమవారం 21 ఆగస్టు 2023 5
శ్రీ సత్యసాయి



ఎసిబి వలలో వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-అనంతపురం

అవినీతి నిరోధక శాఖ వలలో కూడేరు మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి వెంకటేశ్వర ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబు చిక్కారు. ఎరువుల దుకాణం రెన్యూవల్‌కు సంబందించి రూ.15 వేలు లంచం డిమాండ్ చేసిన కేసులో అవినీతి నిరోధక శాఖ అధికారులు వీరిని శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబందించిన వివరాలను డీఎస్పీ వెంకటాద్రి వెల్లడించారు. కూడేరు మండలంలోని మరుట్ల గ్రామంలో బండారు వెంకటేశ్ అనే వ్యక్తి తన గ్రామంలో ఎరువులు, పురుగుల మందుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అనుమతులివ్వడానికి రూ.15 వేలు లంచమివ్వాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర ప్రసాద్ తన కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ గిరాబాబు ద్వారా డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు బండారు వెంకటేశ్ ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో గిరిబాబు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఉండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. వీరిద్దరినీ కర్నూలులోని ఎసిబి కోర్టులో శనివారం హాజరుపరచనున్నట్లు వివరించారు.

సమస్యలు చర్చకు వచ్చేనా..?



జెడ్పీ కార్యాలయంలోని సమావేశ భవనం

ఎండుతున్న పంటలు
తీవ్రమైన విద్యుత్ సమస్య
నేడు జెడ్పీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మూడేళ్ల తరువాత కరువు కమ్మేస్తోంది. పంటలు ఎండిపోతున్నాయి. ఈ సమయంలోనే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగనుంది. జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీలతో పాటు, మండల పరిషత్ అధ్యక్షులు హాజరుకానున్నారు. తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న తరుణంలో జరిగే ఈ సమావేశానికి అయినా ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారా లేదా అన్నది చర్చనీయాంశమైంది. గత కొన్ని సమావేశాల్లో చూస్తే ఒకరిద్దరు మినహా తక్కిన నాయకులెవరూ ఈ సమావేశాలకు హాజరవలేదు. ఈ సమావేశానికైన హాజరై జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

తీవ్రమైన విద్యుత్ సమస్య

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ సమస్య తీవ్రమవుతోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. కోతలు తప్పడం లేదు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రెండు రోజుల వ్యవధిలో 14 మండలాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఆరు గంటలు కూడా విద్యుత్ సరఫరా జరగడం లేదని రైతులు ఆందోళనబాట పట్టారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో ప్రకృతి వైపరీత్యం నెలకొంటే...విద్యుత్ సరఫరా సమస్యతో బోరు బావుల్లో నీరున్నా పంటలను రక్షించుకునే అవకాశం లేకుండాపోతోంది.

ఎండుతున్న పంటలు

ఉమ్మడి జిల్లాలోని 47 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆగస్టులో మరింత తీవ్రమైంది. సుమారు ఎనిమిది లక్షల ఎకరాలు ఇప్పటికీ బీడుగా ఉంది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు కూడా అనువైన పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు భూగర్భ జలాలు సైతం రోజురోజుకు పడిపోతుండటంతో రైతులు సహాయం కోసం ప్రభుత్వం వైపు ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి.

తాగునీటి స్కిమ్ కార్మికుల ఆందోళన

ఉమ్మడి జిల్లాలకు తాగునీటిని అందించే సత్యసాయి శ్రీరామిరెడ్డి, సిపిడబ్ల్యుఎస్ తాగునీటి పథకాలన్నింటిలోనూ పనిచేసే కార్మికులకు వేతనాలు ఆరు మాసాలుగా బకాయి ఉన్నాయి. దీంతో కార్మికులు సమ్మెబాట పట్టారు. ప్రతిసారి వేతనాల కోసం కార్మికులు సమ్మె బాటపట్టాల్సి వస్తోంది. ఈ అంశంపై చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయం

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొద్ది రోజులకు ఒకసారి ప్రధాన కాలువకు గండిపడుతోంది. తక్షణ మరమ్మతులకు రూ.30 కోట్లు నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యలపై జెడ్పీ సమావేశంలో సభ్యులు గళం విప్పుతారా లేదా అన్నది చూడాల్సుంది.

సమయపాలన పాటించాలి

జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-హిందూపురం

మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించాలని అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశించారు. శుక్రవారం హిందూపురం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయ భవనాల మరమ్మతులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగభూషణ, ఎంపిడిఒ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హాజరుపట్టికను పరిశీలిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం మెరుగు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రటరీలకు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ శుక్రవారం రాత్రి తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి కాలువలను శుభ్రం చేయించాలన్నారు. ఈ సమావేశంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి - మడకశిర

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని సిడబ్ల్యూసి మెంబర్ మాజీమంత్రి రఘువీరారెడ్డి అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికైన తర్వాత మొదటిసారిగా మడకశిర నియోజకవర్గంలో రఘువీరారెడ్డి గురువారం పర్యటించారు. వాల్మీకి సర్కిల్లో వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు అనంతరం ర్యాలీగా సాయిబాబా దేవాలయం వరకు వచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల విరామం తర్వాత తాను మొదటిసారిగా సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీని అనర్హత వేటు వేసి కోర్టును తప్పుదోవ పట్టించి సభ్యత్వం రద్దు చేయడంతో తాను ఆవేదనకు గురయ్యానన్నారు. ఈ నేపత్యంలో కాంగ్రెస్ పార్టీపై తనకున్న మమకారంతో తిరిగి పార్టీలో కొనసాగడానికి ముందుకు వచ్చినట్లు వివరించారు. రైతాంగ సమస్యలపై ముసాయిదా కమిటీ తీర్మానానికి తనను కన్వీనర్‌గా ఎంపిక చేసిన రోజు నుంచి తాను కాంగ్రెస్‌పార్టీలో చురుకుగా పాల్గొంటున్నట్లు చెపాపరు. ఇటీవల కర్నాటకలో జరిగిన ఎన్నికల్లో భాగంగా తాను నియోజకవర్గంలో పర్యటించిన 31 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించిందని గుర్తు చేశారు. 140 కోట్ల ప్రజలను ఆదుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని విమర్శించారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు. ప్రజల మన్నలను పొందడానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అభివృద్ధి నిలిచిపోయిందని తిరిగి ఆ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొని రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, కేటీ శ్రీధర్, కోటా సత్యం, కన్వీనర్లు నాగరాజు, గౌడప్ప, మంజునాథ్, గురుమూర్తి లోకేష్, కళ్యాణదుర్గం, కర్నూలు నియోజకవర్గాల నుండి భారీగా వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

రఘువీరాకు ఘనస్వాగతం

లేపాక్షి : సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డికి లేపాక్షి నంది విగ్రహం వద్ద స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కొడికొండ చెక్ పోస్ట్ మీదుగా మడకశిరకు తో వెళుతున్న రఘువీరారెడ్డికి లేపాక్షి లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన లేపాక్షి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలాజీ మనోహర్, రామాంజనేయులు, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు

బకాయి వేతనాలు ఇచ్చాకే విధుల్లోకి....



మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

నిరవధిక సమ్మెలో తాగునీటి పథకం కార్మికులు

ప్రజాశక్తి అనంతపురం, కొత్తచెరువు, పుట్టపర్తి అర్బన్

సత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించేంత వరకు కార్మికులు విధులకు దూరంగా ఉంటారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసగా కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గణేనాయక్ భవన్‌లో శ్రీరామ్‌రెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికుల జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. శ్రీరామ్‌రెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ అధ్యక్షులు బి.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులకు 4 నెలల వేతనాలు బకాయి పడ్డాయని, కాంట్రాక్టర్ శివారెడ్డి వేతనాలు, పిఎఫ్, చెల్లించడం లేదని అన్నారు. గత బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి పిఎఫ్ ఎవరు చెల్లిస్తారో రాతపూర్వకంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ డిమాండ్‌లు నెరవేర్చిన తరువాతనే కార్మికులు చర్చలకు వస్తారని ప్రభుత్వానికి, అధికారులకు తెలిపారు. అంత వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. పోలీసులు, అధికారులు, కాంట్రాక్టర్‌లు కార్మికులకు ఫోన్ చేయరాదని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, కార్మికులు డివిజన్ బాద్యులు యం.నాగరాజు, కోశాధికారి వన్నూరుస్వామి, రాముడు, ప్రభాకర్, గంగాధర్, రామాంజనేయులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన :

తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసగా కొత్తచెరువు మండలం కేసాపురం సమీపంలో సత్యసాయి కేంద్రం వద్ద కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సత్యసాయి నీటి పథకం పంప్‌హౌస్ ఎదురుగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 25వ తేదీ నుండి ఆందోళన చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో విధుల్లోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. గురువారం నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్ళామని తద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందు ఏర్పడితే అందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి వాటర్ సప్లై ప్రాజెక్టు వర్కర్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు ఎన్ శ్రీనివాసులు రాము, కార్మికులు పాల్గొన్నారు.

అర్థ నగ్న ప్రదర్శన : పుట్టపర్తి పట్టణంలోని పంప్ హౌస్ వద్ద సత్యసాయి త్రాగునీటి సరఫరా కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. విధి లేని పరిస్థితులలో సమ్మెలోకి వెళుతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె కొనసాగుతుందని తెగేసి చెప్పారు. వీరి నిరసనకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు మధు, శ్రీనివాసులు నాయుడు, రవి, చందు, చంద్ర, వేణు తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న జిఎల్. నరసింహులు

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల్లో నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్పొరేట్ విద్యాసంస్థల కోసం ప్రభుత్వాలు పేద విద్యార్థులకు ఉచిత విద్యను దూరం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు జిఎల్ నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 5వ జిల్లా ప్లీనరీ సమావేశాలు గురు, శుక్రవారం కదిరి పట్టణంలో నిర్వహించారు. ఈ సమావేశాలకు 2వ రోజు ముఖ్యఅతిథిగా జిఎల్ నరసింహులు హాజరై మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయద్దని కోరారు. రాష్ట్రంలో పాలకులు విద్యా సంస్కరణల పేరుతో ప్రయివేట్, కార్పొరేట్ విద్యను అందలమెక్కించేందుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను విచ్చిన్నం చేస్తున్నారన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నేటికీ జగనన్న విద్య దీవెన అందడం లేదని వాపోయారు. వివిధ పథకాలు, అస్తవ్యస్త విధానాలు, విలీనాలు, జీవోల పేరుతో ప్రభుత్వ విద్య వ్యవస్థను నాశనం చేస్తూ పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారన్నారు. ఇలాంటి పాలకుల విధానాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోరాడాలని, ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులకు ప్రసంగించారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ పరిరక్షణ పేరుతో శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా స్కూటర్ యాత్రను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బాబావలి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, ఉపాధ్యక్షులు బాబ్‌జాన్, పవన్, నాయకులు విజయకుమార్, జిలాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేస్తే విజయం తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం నియోజక వర్గంలో నేతలందరు సమిష్టిగా కృషి చేస్తే విజయం తథ్యం అని మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గంలో వైసిపికి పెద్ద ఎత్తున ఓటు బ్యాంకు ఉందన్నారు. నేతలందరు ఐకమత్యంతో పని చేస్తే ఇక్కడ విజయం సులభం అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పంలో సైతం గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల, పురపాలక ఎన్నికల్లో కుప్పంలో 90శాతం పైగా స్థానాలను వైసిపి విజయం సాధించిందని మంత్రి గుర్తు చేశారు. హిందూపురంలో నాయకులు విబేధాలు వీడి సమిష్టిగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో తమ పార్టీ అభ్యర్థి దీపిక వేణు రెడ్డి గెలుస్తుందని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అటు కుప్పం...ఇటు హిందూపురం నియోజక వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఆ దిశగా ప్రతి కార్యకర్త అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శం అని తెలిపారు. కేవలం రెండు పేజీల ఎన్నికల అజెండాను రూపొందించి చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 52 శాతం ఓట్లు సాధించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైసిపి నాయకులు, కార్యకర్తలు కలసి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకు ముందు మాట్లాడిన వైసిసి స్థానిక నాయకులు నవీన్ నిశ్చల్, అబ్దుల్ ఘని,వేణు గోపాల్ రెడ్డి, మధుమతి రెడ్డి తదితరులు తాము సమిష్టిగా పనిచేసి దీపిక వేణురెడ్డి విజయం కోసం పని చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శంకర్ నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు బలరామిరెడ్డి, జబివుల్లా, నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

మంత్రి పెదిరెడ్డి రామచంద్రా రెడ్డి సమక్షంలో పలువురు టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. ఇటీవల హిందూపురం రూరల్ మండలం చలివెందుల పంచాయతీ ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన రవీంద్రారెడ్డి తదితరులు పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. వ ు ం ్రతి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి హిందూపురం పర్యటనలో భాగంగ స్థానిక వైసిపి నాయకుల ఇళ్లకు వెళ్లారు. ఎఇ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, వైసిపి మాజీ సమన్వయ కర్త కొండురు వేణు గోపాల్ రెడ్డి తదితర నాయకుల ఇళ్లకు వెళ్లివారి అనుచరులతో మాటామంతి చేశారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తిగోరంట్లరూరల్

మండలంలోని మల్లాపల్లి జగనన్న లేఅవుట్ నిర్మించిన ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మల్లాపల్లి జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయత్ రాజ్, ఇంజనీరింగ్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ శుక్రవాంర పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్లాపల్లి జగనన్న లేఅవుట్‌లో ఈ నెల 30న చేపట్టే సామూహిక గృహ ప్రవేశాలకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ దశలలో ఉన్న గృహాలను పూర్తి చేయించాలన్నారు. లేఅవుట్ లో అన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు, మ్యాజిక్ సోక్ పిట్ ల ఏర్పాటు, అంతర్గత రోడ్లు, నీటి వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కాలనీ ముఖ ద్వారం వద్ద ఆర్చి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడా జాప్యం తగదన్నారు. మల్లాపల్లి మిట్ట హౌసింగ్ కాలనీ లేఅవుట్‌లో 287 ఇల్లు ఉండంగా 106 పూర్తి అయ్యాయని రూఫ్ లెవెల్ 57, బిబిఎల్ 19, ఆర్ సి లెవెల్ 2, బిఎల్ 103 ఉన్నాయని అధికారులు జిల్లా కలెక్టర్ వివరించారు . ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని నరేగా నిధులు ద్వారా ఆ కార్యక్రమం చేపట్టాలని ఈసందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, జెడ్పీటీసీ జయరాం నాయక్, ఎంపీపీ, సర్పంచి తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్

లేపాక్షి : లేపాక్షి ఆలయాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం సందర్శించారు. నంది. జాటాయువు పక్షి ప్రాంతాలను సందర్శించారు, ఈసందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, ఆలయ అర్చకులు శీనస్వామి, సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు వెరిఫికేషన్ పరిశీలన

రొద్దం : మండల పరిధిలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్‌ను శుక్రవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన దాదాపు 47 పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భవనాలు, పోలింగ్ సెంటర్లను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ అనంతాచారి, తదితరులు పాల్గొన్నారు.

హౌస్ టూ హౌస్ సర్వేపై జెసి సమీక్ష

లేపాక్షి : హిందూపురం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ చేతన్ శుక్రవారం హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని లేపాక్షి మండలంలో ఎఇఆర్‌ఒలు, సూపర్‌వైజర్లు, లేపాక్షి మండలానికి సంబంధించిన బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి హౌస్ టూ హౌస్ సర్వేపై సమీక్ష చేశారు. ఇంటి ఓటర్ల నమోదు, తొలగింపులో తీసుకోవాల్సిన నిబంధనలను వివరించారు. సమావేశంలో తహశీల్దార్ బాబు, డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, ఆర్ఐ జయలక్ష్మి, విఆర్ఒలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ సిఐగా పి.యతీంద్ర

ముదిగుబ్బ : పట్టణంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పి.యతీంద్ర నూతన సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఈయన పుట్టపర్తి దిశా పోలీస్‌స్టేషన్ సిఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అంజాద్‌బాషా, నరేష్, ప్రసాద్, సురేష్ స్వాగతం పలికారు. అనంతరం సిఐ మాట్లాడుతూ అసాంఘిక శక్తులు, అల్లరిమూకలు, రౌడీ షీటర్లపై గట్టి నిఘా పెట్టి శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని, ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తామన్నారు. నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అజార్, చంద్రాయుడు, శ్రావణ్, రామ్మోహన్‌రెడ్డి, శీన, ఎం.శీన, తదితరులు సిఐని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ జెర్సీ ఆవిష్కరణ

కదిరి టౌన్ : యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి వైఎస్ఆర్ పేరు మీద తలుపుల మండలంలో చేపట్టిన క్రికెట్ టోర్నీ జెర్సీని శుక్రవారం డాక్టర్ బత్తల వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు డికె బాబు, బాబా, జాకీర్, బిసి నాయకులు, ప్రభువర్ధన్, పవన్, హరి, శ్రీనాథ్‌బాబు, సాయి, అమీన్, మౌలాలి, మౌలా, కళ్యాణ్, గణేష్, వేణుగోపాల్, పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి : సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపిపి బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సౌజన్యకుమారి తెలిపారు. బత్తలపల్లిలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని, ఎవరూ గైర్హాజరు కావద్దని సూచించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

కదిరి టౌన్ : అనంతపురం-కదిరి ఎక్స్‌ప్రెస్ సర్వీసులో ల్యాప్‌ట్యాప్‌తో పాటు బ్యాగును మరచిపోయి బస్సు దిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనిల్‌కుమార్‌కు శుక్రవారం ఆర్టీసీ డిపో అధికారులు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. అనిల్‌కుమార్ ల్యాప్ ట్యాప్, ఇతర విలువైన వస్తువులు వున్న బ్యాగ్‌ను లగేజీ క్యారియర్‌లో పెట్టి మరచిపోయి బత్తలపల్లిలో దిగాడు. ఈ బ్యాగును కండక్టరు శంకర్ గుర్తించి భద్రపరచాడు. అనంతరం ఆఫీసు సిబ్బంది రియాజ్, క్రిష్ణయ్య, నాగసుబ్బయ్య సమక్షంలో అనిల్ కుమార్‌కు ఆ బ్యాగును అందజేశారు. విలువైన ల్యాప్ ట్యాప్ దొరికినందుకు, నిజాయితీగా బ్యాగును అందజేసినందుకు కండక్టర్ శంకర్‌కు అనిల్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. శంకర్ నిజాయితీని డిపో మేనేజర్ బి.మైనోద్దీన్ ప్రశంసించారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

హిందూపురం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు నెల మొదటి వారం నుంచి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి షేక్‌అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ చదివిన వారందరూ అర్హులని, ఆసక్తి కల నిరుద్యోగ యువత 9492051475, 9959419089 సంప్రదించాలని కోరారు. లేదా ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల నేరుగా గాని పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సిడిపిఒపై ఆరోపణలు...సబ్ కలెక్టర్ విచారణ

పెనుకొండ : సిడిపిఒ రూ. 3 లక్షలు లంచం తీసుకుని గోరంట్ల మండలంలోని వానవోలు-1 అంగన్వాడీ కేంద్రంలో ఆయాకు కార్యకర్తగా ఉద్యోగోన్నతి కల్పించారని ఆరోపిస్తూ గోరంట్ల మండల పరిధిలోని వానవోలు గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై శుక్రవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ సిడిపిఒ అనురాధ, అంగన్వాడీ కార్యకర్త శోభలను విచారించారు. ఇదిలా ఉండగా నోటిఫికేషన్ ఇచ్చి కార్యకర్త పోస్టు భర్తీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

ధర్మవరం టౌన్ : ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో శుక్రవారం పట్టణంలోని సూర్య పాఠశాల విద్యార్థులు సంబరాలు చేసుకున్నా రు. ఇందులో భాగంగా స్థానిక రేగాటిపల్లి సర్కిల్‌లో ఎంఇఒలు గోపాల్ నాయక్, రాజేశ్వరీదేవి చేత కేక్ కట్ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయంతో భారతదేశ కీర్తి ప్రపంచ నలుమూలల విస్తరించిందన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ పతాకంతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేంద్రబాబు, డైరెక్టర్ రఘునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-తనకల్లు

స్వచ్ఛభారత్ కార్మికులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని, పంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, తదితర ప్రయోజనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో సమ్మె చేపట్టామన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించడానికి వచ్చిన కదిరి ఆర్‌డిఒ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. సమ్మెలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న, బాబావలి, సిపిఎం మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం జిల్లా సభ్యులు వివి రమణ, పంచాయతీ కార్మికులు రమణప్ప, గంగాధర, స్వచ్ఛభారత్ కార్మికులు అంజి, శివన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో భాగంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుక్రవారం గడ్డి, దుమ్ము తింటూ మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో వారు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకుడు ఎస్.అమీర్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు అక్కులప్ప, నరసింహులు, కదిరప్ప, ఆంజనేయులు, గంగులప్ప, పాల్గొన్నారు.

తలుపుల : తలుపులలో పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఐ, టిడిపి, ప్రజాసంఘాలు మద్దతు ఇచ్చాయి. సమ్మెలో సిపిఐ మండల కార్యదర్శి జె.ఈశ్వరయ్య, టిడిపి నాయకులు ఎద్దుల రాముడు, కార్మికులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకులు లింగారెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మెను ఆపేది లేదన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు సజ్జప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు స్వచ్ఛ భారత్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో ఎపి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాబా, సిపిఎం సీనియర్ నాయకులు రమణ, సిఐటియు మండల కార్యదర్శి శ్రీరాములు, అధ్యక్షులు కుళ్లాయప్ప, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం యూనియన్ నాయకులు అంజనప్ప, అంజనమ్మ, రత్నమ్మ, భాగ్యమ్మ, సాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరు డప్పు వాయిస్తూ ర్యాలీ చేపట్టిన కార్మికులు

చిలమత్తూరు : పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు 2వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం డప్పులు వాయిస్తూ పురవీధుల్లో వినుత్నంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిచో రాబోయే కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

హిందూపురం : స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెకు శుక్రవారం సిఐటియు నాయకులు మద్దతు పలికారు. అనంతరం ఎంపిడిఒ నరేంద్ర కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సమ్మెలో సిఐటియు నాయకులు రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన భారతి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రాజేంద్రనగర్‌కు చెందిన భారతి కూలి మగ్గం నేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. భర్త నాగరాజు మూడేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందగా అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యేది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న ఏవో మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పరిగి : మండల పరిధిలోని జయమంగళ నది నుంచి అక్రమంగా కొడిగెనహళ్లి ప్రాంతానికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఎస్ఐ నరేంద్ర సీజ్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అలాగే సిగిపల్లి వద్ద నుంచి సోమందేపల్లి మండలానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సిఐ శ్రీధర్ పట్టుకొని స్టేషన్‌లో అప్పజెప్పారు. ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని వీరజిన్నేపల్లి చెరువు సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పుట్టపర్తి డిఎస్పి వాసుదేవన్ శుక్రవారం ఉదయం పుట్టపర్తి-కదిరి ప్రధాన రహదారిలో వెళుతున్న సమయంలో మట్టి తరలింపును గ్రహించి వెంటనే వివరాలు తీసుకోగా వాహన యజమానులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో 4 ట్రాక్టర్లు, 1 జెసిబిని పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కు తుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్‌రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే వైసి తిమ్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డితో పాటు మంత్రి హెచ్‌డి నరసయ్యగౌడ్, జిల్లా వైసిపి అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ, టిటిడి బోర్డు మెంబర్ అశోక్ కుమార్, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైసి తిమ్మారెడ్డి సేవలను కొనియాడారు. సిఎం జగన్ కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సుపరిపాలన అందిస్తున్నారని, మరోమారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నరసింహులు, మాజీ జడ్పిటిసి జిబి శివకుమార్, అమరాపురం సర్పంచి వాగేష్‌గౌడ్, రంగేగౌడ్, జడ్పిటిసిలు భూతరాజు, నరసింహమూర్తి, ఐదు మండలాల ఎంపిపిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పర్యటనకు శుక్రవారం వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పలువురు కలిసి వారి సమస్యలపై వినతులు ఇచ్చారు. లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్ నివాసంలో హిందూపురం పాస్టర్ ఫెలోషిప్, క్రైస్తవ పెద్దలతో కలిసిన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రైస్తవులకు శ్మశాన వాటిక వెంటనే కేటాయించాలని, తాత్కాలికంగా ఉన్నదాన్ని ఫెన్సింగ్ కూడా వేయించాలని, క్రైస్తవ పెద్దలు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ప్రకాష్, దేవరాజ్, శ్రీకాంత్, ఏసురత్నం, ఎలీషా, సునీల్, శ్రీ వాణి ఉదయ్, శ్రీరాములు, చైతన్య గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నీవాపై దృష్టి సారించండి

హిందూపురం నియోజక వర్గానికి వరంగా ఉన్నా హంద్రీనీవాపై ప్రత్యేక దృష్టి సారించాలని జలసాధన సమితి నాయకులు మంత్రిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు చేయాలని, చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు హంద్రీనీవా కాలువ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ ప్రాంత ప్రజలు, హంద్రీనీవా ప్రాజెక్టు నీటి కోసం 30 సంవత్సరాలు ఎదురుచూస్తున్న ప్రజలకు చివరకు నిరాశేమిగిలిందన్నారు. పెనుకొండ వద్ద గొల్లపల్లి రిజర్వాయర్ నుండి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, లేపాక్షి, హిందూపురం, పరిగి, మడకశిర నియోజకవర్గం, ఈ ప్రాంతాల్లోని 265 చెరువు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు నింపటానికి ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడిందన్నారు. ఏడాదిలో 9 నెలలు కాలువ పారినప్పటికి కేవలం 34 చెరువులు మాత్రమే నింపగలిగారన్నారు. వర్షాకాలం వరదలు వచ్చే సమయంలో నీరు నిలువ చేసుకోటానికి పందిపర్తి వద్ద ఒక రిజర్వాయర్ నిర్మించాలన్నారు. దేమకేతేపల్లి హంద్రీనీవా కాలువ వద్ద ఒక లిఫ్టును ఏర్పాటు చేసి నీళ్లను ఎత్తిపోసి చిలమత్తూరు-గోరంట్ల మండలాలకు హంద్రీనీవా ద్వారా నీటిని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు శ్రీనివాసులు, సిద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగి రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి సమస్యలు వివరిస్తున్న పాస్టర్స్

వడ్డెర్లపై దాడులను నిరసిస్తూ 28న శాంతి ర్యాలీ

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవళ్ల మురళి, కొల్లకుంట అంజినప్ప డిమాండ్ చేశారు. వారు శుక్రవారం పట్టణంలో వడ్డెర సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రవర్ణ కులాలు వడ్డెర జాతిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇటీవల గోరంట్ల మండల పరిధిలోని వెంకటరమణపల్లిలో వడ్డెర్లపై జరిగిన దాడిని నిరసిస్తూ, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28వ తేదీ గోరంట్లలో శాంతి ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి పార్టీలు, సంఘాలకు అతీతంగా వడ్డెర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి తరలివచ్చి సత్తా చూపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటగిరి పాళ్యం శ్రీనివాసులు, వడ్డెర సాధికార రాష్ట్ర డైరెక్టర్ పరిగి హనుమయ్య, మునికుమార్, కడప రామాంజి, పెద్దన్న, చిలకమారి పల్లి రామాజినేయులు, రోడ్డు శ్రీనివాసులు, పరశురామ్, హనుమన్న, శివరాం, సత్తి, గంగాధరప్ప, తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న వడ్డెర సంఘం నాయకులు


బాధితుడు శ్రీనాథ్ ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న సామకోటి ఆదినారాయణ

ప్రమాద బాధితుడికి 'సామకోటి' పరామర్శ

నల్లమాడ : మండల పరిధిలోని మసకవంగపల్లి గ్రామానికి చెందిన టిడిపి వార్డు మెంబర్ శ్రీనాథ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో శుక్రవారం టిడిపి నాయకులు సామ కోటి ఆదినారాయణ ఆ గ్రామం వెళ్లి శ్రీనాథ్‌ను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో డా. నాగభూషణం నాయుడు, సుబ్బరాయుడు, వల్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డికి సన్మానం

నల్లమాడ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డిని శుక్రవారం నల్లమాడ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు గౌస్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రఘువీరారెడ్డిని పూలమాల, దుశ్శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన పదవి దక్కడంతో హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబుని కలిసిన వడ్డెర సంఘం నాయకులు

నల్లమాడ : ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు దలవాయి వెంకటనారాయణ, వడ్డే సిమెంట్ పోలన్న, జెరిపిటి కృష్ణమూర్తి గురువారం రాత్రి టిడిపి అధినేత చంద్రబాబుని కలిశారు. ఈ సందర్భంగా వారు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గంతో పాటు, మరో నియోజకవర్గాన్ని వడ్డెర్లకు కేటాయించాలని చంద్రబాబుని కోరినట్లు కృష్ణమూర్తి తెలిపారు. ఇందుకు సంబంధించి బయోడేటాలను సమర్పించగా అధినేత సుముఖత వ్యక్తం చేశారని వారు తెలిపారు.

ఈ-పంట నమోదు పరిశీలన

హిందూపురం : రూరల్ మండలం చలివెందుల పంచాయతీ రాచపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ అధికారుల తో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీ ఆవుటాల రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ పంట నమోదు యొక్క ప్రాముఖ్యత, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ అల్తాఫ్ ఆలీఖాన్, మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, విస్తరణ అధికారి శంకర్, ఎఈఓలు స్వప్న, రామక్రిష్ణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాశినాయన ఆశ్రమానికి చేయూత

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని గరుడంపల్లి వద్ద ఉన్న కాశినాయన ఆశ్రమం నూతన వంటశాలకు శుక్రవారం పట్టణానికి చెందిన చేనేత ప్రముఖులు కాచర్ల అంజి రూ. 20 వేలు, రాజేశ్ రూ. 50,116, బొమ్మిశెట్టి బాలరాజు రూ. 15వేలు, చింతా మారుతి రూ.5వేలు, చింతా వాసు రూ. 5వేలు, డెకరేషన్ కృష్ణ రూ. 5వేలను ఆశ్రమ నిర్వాహకుడికి అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

గోరంట్ల : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అవార్డు గ్రహీత సిఐ సుబ్బరాయుడును ఎంపిపి ప్రమీలమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈయన పంద్రాగస్టు వేడుకల్లో కలెక్టర్, ఎస్పీల నుంచి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. దీంతో ఎంపిపితో పాటు వైస్ ఎంపిపి రామలక్ష్మమ్మ నాగభూషణ్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ జబ్బార్, ఎంపిటిసి సోమశేఖర్, ఎంఇఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సిఐని సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, నరసింహులు, కిష్టప్ప, ఓబులేసు పాల్గొన్నారు

ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చివేత

కొత్తచెరువు : కొత్తచెరువు-పుట్టపర్తి ప్రధాన రహదారిలో ప్రభుత్వాసుపత్రి వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఏడాదిగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీనికి తోడు పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ మార్గంలో నిత్యం స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బి అధికారులు రాకపోకలు సాగిస్తున్నారే కానీ వీటి గురించి పట్టించుకోలేదు. దీంతో టిడిపి వార్డు మెంబర్ రమేష్ బాబు సొంత ఖర్చుతో ట్రాక్టర్ ద్వారా మట్టిని తోలించి గుంతలను పూడ్చి చదును చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి-గోరంట్ల

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం చేస్తామని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. పట్టణంలోని టిటిడి కల్యాణ మండపంలో శుక్రవారం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా చండీఘడ్ రాష్ట్రానికి చెందిన దిల్బాగ్ టంక్, పంజాబ్ నుంచి అశోక్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆకాష్‌రాజ్, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ వాల్మీకి, బోయలకు దేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా రిజర్వేషన్లు అమలవుతున్నాయన్నారు. బోయలు ఆదివాసులుగా జీవనం సాగిస్తున్నారని, ఎపిలో మాత్రమే బిసి జాబితాలో ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం రాక మునుపే బోయలు ఎస్టీ జాబితాలో ఉన్నారని, కావున బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిదన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, నెల్లూరు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, గుంటూరుకు చెందిన గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


గోరంట్లలో సమావేశమైన వాల్మీకి సంఘం నాయకులు

కమ్యునికేషన్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎస్ డిజిఎస్ కళాశాలలో ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ ల్యాబ్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అంతకు ముందు కళాశాల ఎన్ సి సి క్యాడేట్స్ గార్డ్ ఆఫ్ హానర్, సెరిమోనియల్ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం ళాశాల ప్రాంగణంలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా మంత్రి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి వసతులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో ఆర్యవైశ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి, కళాశాల కమిటీ అధ్యక్షులు రేవూర్ చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ దాసా సురేష్, కోశాధికారి నందకిషోర్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ జేఎస్వీఎస్ ప్రసాద్, ఎంబిఎ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, మండి మర్చంట్ అసోసియేషన్స్, ఆర్యవైశ్య సంఘాల వారు పాల్గొన్నారు.


కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి


రఘువీరాను కలిసిన కోటా సత్యం, పఠాన్‌గౌస్

రఘువీరాను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సిడబ్ల్యూసి సభ్యునిగా ఎన్నికైన మాజీ మంత్రి రఘువీరారెడ్డిని శుక్రవారం మాజీ డిసిసి కోటా సత్యం, నల్లమాడ మండల కన్వీనర్ పఠాన్ గౌస్, తదితరులు నీలకంఠాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బొకేలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘువీరాకు పార్టీలో అత్యున్నత పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. పార్టీకి జిల్లాలో, రాష్ట్రంలో పూర్వ వైభవం రావడం ఖాయమన్నారు. రఘువీరా తన రాజకీయ అనుభవంతో పార్టీని తగిన రీతిలో తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

రహదారి అనుమతి కోసం గ్రామసభ

ప్రజాశక్తి-గాండ్లపెంట

అటవీ భూమిలో రహదారి, సౌకర్యాల కోసం శుక్రవారం మండల పరిధిలోని గొడివెలగల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎంపిడిఒ రామనాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి జగన్మోహన్ మాట్లాడుతూ తుమ్మలబయలు పెద్దతండా అటవీ భూమిలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో గ్రామసభ నిర్వహించి రహదారులు జాబితా తయారు చేసి అటవీ శాఖ అధికారులకు నివేదిక పంపించి అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిఆర్‌జెఇ రెడ్డి ప్రసాద్, విఆర్వో జయరాం, పంచాయతీ కార్యదర్శి బాషా, సర్పంచులు రవీంద్రనాయక్, ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

3న జెవివి జిల్లా మహాసభలు

జిల్లా అధ్యక్షులు ఆదిశేషు

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని గ్లోబల్ జెన్ పాఠశాలలో సెప్టెంబర్ 3వ తేదీ జెవివి శ్రీసత్యసాయి జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ఆదిశేషు తెలిపారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ రెసిడెన్సీలో శుక్రవారం ఆదిశేషు ఆధ్వర్యంలో పెనుకొండ డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి నూతనంగా జోనల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎంకె నబి, సభ్యులుగా హరి, ఎం.సుధాకర్, నారాయణస్వామి, సోమశేఖర్, రాజశేఖర్, ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆదిశేషు చంద్రయాన్-3 విజయవంతం ద్వారా భారతదేశ గౌరవాన్ని చాటిని ఇస్రో ఛైర్మన్, అధికారులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాల జెవివి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

సత్యసాయి భక్తురాలు అందజేసిన రెండు సైకిళ్లను శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఎడి నాగరాజు మండల పరిధిలోని తిరుమలదేవరపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు కమ్మర గాయత్రి, నాగమోహన్‌లకు పంపిణీ చేశారు. ఈ విద్యార్థులు కోడపగానిపల్లి ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నారు. రోజూ పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతుండడంతో ఉపాధ్యాయులు సత్యసాయి భక్తురాలు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జయచంద్ర, హెచ్ఎం చలపతి, ఉపాధ్యాయులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే 'గడపగడపకూ' లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని కనిశెట్టిపల్లి, మైలేపల్లి, తిరుమల దేవరపల్లి, కొడపగానిపల్లి, వేములేటిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పోలింగ్ బూత్ కమిటీ మేనేజర్లు, సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్లు, వైసిపి పార్టీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

5న చేనేత సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో సెప్టెంబర్ 5వ తేదీ జరిగే చేనేత సదస్సును జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెం.కటస్వామి, వెంకటనారాయణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కదిరి గేట్ వద్ద ఉన్న చేనేత విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముడిపట్టు సరుకుల ధరలు పెరిగి గిట్టుబాటు ధరలేక, ఇతర పనులకు వెళ్లలేక నానా అగచాట్లు పడుతున్నారన్నారు. చేనేతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. సదస్సుకు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, చెన్నభంగం. చెన్నంపల్లి శ్రీనివాసులు, శ్రీధర్, బాలరంగయ్య, నరసింహులు, సురేశ్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

SHAIK BABAJAN, I do hereby declare that my name mentioned as REDDYAPALLI BAVAJAN (old name) in my passport No. G5973786. Old name changed as SHAIK BABAJAN (New name) as per Aadhar No. 2124 7167 8972, and my father name mentioned as ABDUL MUNAF (Old name) in my passport No.G5973786. My father Old name changed as SHAIK ABDUL MUNAF (New name) as per my Aadhar No. 2124 7167 8972 Present residing at D.No.9/124-1B, Bombaybasha Street, Kadiri Post and Town, Sri Satya Sai District, A.P. 515591.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, HINDUPUR
O.S. No. 17 /2021

Between:
E.Ramachandra ...**Plaintiff**
And
T.Rizwan Khan ...**Defendant**
To,
T.Rizwan Khan S/o T.Fayaz Khan, Muslim, aged 30 years, Business, Door No.26-4-1778A, R.T.C. Colony, Nimra Mazeed Street, Hindupur Town .

SUMMONS TO DEFENDANT

Please take Summons that the Plaintiff Filed a suit against You for recovery of the suit amount. You may attend the court on 08-09-2023 at 10.30 A.M. either in person or through an Advocate, if, you be failed to do so, thematter will be decided an ex-parte.

By the order of the court
K.NAGAPPA
ADVOCATEA FOR PLAINTIFF
HINDUPUR.